సాక్షి కామారెడ్డి

గురువారం । 7 । డిసెంబర్ । 2023



వైభవంగా రథోత్సవం
ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన కాలభైరవ స్వామి జన్మదిన ఉత్సవాలలో భాగంగా రథోత్సవం నిర్వహించారు.
- 8లో ▸



ముగిసిన ఉత్సవాలు
మద్నూర్‌లోని వీరభద్రుడి ఆలయ ఉత్సవాలలో భాగంగా బుధవారం పల్లకీసేవ, అగ్ని గుండాలు నిర్వహించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /18.7

వాతావరణం
ఉదయం శీతలగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

వచ్చేనెలలో జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ

- ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలుర విభాగం పోటీలకు కామారెడ్డి వేదిక
- పాల్గొననున్న వివిధ రాష్ట్రాల జట్లు



సాక్షి, కామారెడ్డి: జాతీయ స్థాయి క్రీడా పోటీలకు కామరెడ్డి జిల్లా తొలిసారిగా వేదిక అవుతోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్–17(బాలుర విభాగం) జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు వచ్చేనెల 7 నుంచి నిర్వహించనున్నారు. జనవరి 7 నుంచి 11 వరకు పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగే పోటీలలో ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 40 జట్లు పాల్గొననున్నాయి. ఒక్కో టీంలో 12 మంది క్రీడాకారులతో పాటు స్టాండ్‌బైలో మరో ముగ్గురు కలిపి 15 మంది చొప్పున 6 వందల మంది క్రీడాకారులు జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణ, క్రీడాకారులకు వసతి ఇతర సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మ్యాట్ మీద నిర్వహించే పోటీలకోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

హాకీ అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలు

సాక్షి, కామారెడ్డి: జిల్లాకేంద్రంలో ఈనెల 16, 17, 18 తేదీలలో రాష్ట్ర స్థాయి అండర్–14 హాకీ పోటీలు జరుగనున్నాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి హాకీ జట్లు ఈ టోర్నీలో పాల్గొననున్నాయి. బాలురకు పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో, బాలికలకు డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహించనున్నారు. పోటీల కోసం హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

చేనేత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

దోమకొండ: మండల కేంద్రంలోని ఆనంద్ భవన్‌లో చేనేత కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దోమకొండ గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో స్టైఫండ్ కింద రోజుకు రూ.300 చొప్పున అందజేస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వ చేనేత జౌళిశాఖ ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 94931 43378 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వణికిస్తున్న తుపాన్

సాక్షి, కామారెడ్డి: తుపాన్ ప్రభావంతో జిల్లాలో జల్లులు కురుస్తున్నాయి. దానికితోడు చలిగాలులు వీస్తుండడంతో జనం వణుకుతున్నారు. రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా వాతావరణం చల్లగా ఉంటుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం కాసేపు ఎండ వచ్చినట్టే వచ్చి తర్వాత మళ్లీ ముసురు పెట్టింది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురిశాయి. దీంతో పగటిపూట కూడా బయట తిరగలేని పరిస్థితి ఏర్పడింది. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లిన విద్యార్థులు చలితో వణికిపోయారు. రోడ్లపై చిన్నచిన్న వ్యాపారాలు, వృత్తులు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

10న మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీ

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మాస్టర్ అథ్లెటిక్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనునాయక్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వారు ఈ టోర్నీలో పాల్గొనవచ్చన్నారు. 100, 200 మీటర్ల పరుగు, షాట్‌పుట్, డిస్క్‌త్రో, లాంగ్ జంప్, 5 కిలోమీటర్ల నడక పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఫిబ్రవరి 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే టోర్నీకి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గోపిరెడ్డి(99495 85065), ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిరణ్‌కుమార్(94400 07576)లను సంప్రదించాలని సూచించారు.



ఇక 'పంచాయతీ'!

- ఫిబ్రవరి 1 తో ముగియనున్న పదవీకాలం
- జిల్లాలో 526 సర్పంచ్, 4,642 వార్డు స్థానాలు
- వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించే అవకాశం
- కసరత్తు చేస్తున్న ఎలక్షన్ అధికారులు

అసెంబ్లీ ఎలక్షన్ల లొల్లి ముగిసిందో లేదో పల్లె పంచాయతీ వంతొచ్చింది. ఎన్నికలకు సంబంధించిన కసరత్తు షురూ అయ్యింది. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1 తో ముగియనుండడంతో జనవరిలోనే ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు.

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో 526 పంచాయతీలున్నాయి. ఆ గ్రామాల సర్పంచ్‌లతో పాటు 4,642 వార్డు సభ్యుల పదవీ కాలం ఫిబ్రవరి ఒకటితో ముగియనుంది. కాగా పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్ ఉండేలా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈసారి ఎన్నికలు పాత రిజర్వేషన్లతోనే నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు కలెక్టర్లను ఆదేశించారు. రెండు వందల మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, 2 వందల నుంచి 4 వందల మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 మంది నుంచి 650 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాలని సూచించారు. ఈ నెలాఖరులోపు పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.

మరోసారి వేడెక్కనున్న రాజకీయాలు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలుగా పల్లెల్లో రాజకీయాలు గరంగరంగా నడిచాయి. ఆయా రాజకీయ పార్టీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహించాయి. ఎన్నికలు పూర్తై, కొత్త ప్రభుత్వం కొలువుదీరుతుండడంతో గ్రామ స్థాయి నేతలు ఇప్పుడిప్పుడే ఎవరి పనుల్లో వారు బిజీ అవుతున్నారు. అంతలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తుండడంతో మరోమారు పల్లెల్లో రాజకీయాలు వేడెక్కనున్నాయి. ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో 119 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈసారి రాజకీయ పరిస్థితులు మారాయి. అన్నిచోట్ల మూడు ప్రధాన పార్టీలకు బలమైన నేతలు తయారయ్యారు. ఈ నేపథ్యంలో అంతటా తీవ్రమైన పోటీ ఉండే అవకాశం ఉంది.

అడ్డగోలుగా పెరగనున్న ఖర్చు

ఈసారి పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్‌గా పోటీ చేయడానికి చాలామంది ఉత్సాహంగా ఉన్నారు. వివిధ వ్యాపారాల్లో డబ్బులు సంపాదించిన వారు హోదా కోసం పంచాయతీ బరిలో దిగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందుకోసం పట్టణాల్లో స్థిరపడిన వారు సైతం పల్లెల్లో ఓట్లు నమోదు చేసుకున్నారు. హోదాకోసం ఎంత ఖర్చయినా సరే పెట్టేందుకు చాలాచోట్ల నేతలు సిద్ధంగా ఉన్నారు. దీంతో పోటీ తీవ్రంగా ఉండి ఎన్నికల ఖర్చు అడ్డగోలుగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐదేళ్లలో చాలా గ్రామాల్లో సర్పంచ్‌లకు నిధులు లేక, చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే ప్రధాన రోడ్ల పక్క గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలకు చుట్టుపక్కల గ్రామాల్లో భూముల ధరలు పెరగడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున జరగడం కొందరు సర్పంచ్‌లకు కలిసి వచ్చింది. అలాంటి గ్రామాల్లో పోటీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు.

కాటేపల్లి తండా కథ అంతేనా?

పెద్దకొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి తండాను పంచాయతీగా ఏర్పాటు చేశారు. తండా కావడంతో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల స్థానాలన్నింటినీ ఎస్టీలకు రిజర్వు చేశారు. అయితే కాటేపల్లి తండాలో ఉన్నది మధుర(కాయితీ) లంబాడీలు. వారు బీసీ జాబితాలో ఉన్నారు. ఇక్కడ ఎస్టీ రిజర్వేషన్ ఉన్నవారు ఒక్కరు కూడా లేరు. దీంతో ఐదేళ్లుగా ఈ గ్రామంలో ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. పంచాయతీగా మారినందుకు ఆనందించాలో.. రిజర్వేషన్ సమస్యతో పాలకవర్గమే లేనందుకు బాధపడాలో తెలియని అయోమయ పరిస్థితిలో గ్రామస్తులున్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీ పాలకవర్గం రిజర్వేషన్లు పదేళ్లపాటు అమలులో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈసారీ ఇక్కడ ఎన్నికలు నిర్వహించే అవకాశం లేనట్లేనని భావిస్తున్నారు. ఎన్నికల అధికారులు స్పందించి, రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అమాత్య యోగం.. అందని ద్రాక్షేనా?

- ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంపై పాలకుల చిన్నచూపు
- ఆరున్నర దశాబ్దాలలో ఒక్కసారీ దక్కని మంత్రి పదవి
- నిరుత్సాహంలో జుక్కల్ నియోజకవర్గ ప్రజలు



నిజాంసాగర్: రాష్ట్రంలో మారుమూలనున్న జుక్కల్ నియోజకవర్గంపై పాలకులు శీతకన్ను వేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మంత్రి పదవి కోసం ఇక్కడి ఎమ్మెల్యేలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో ఇక్కడివారికి అమాత్య పదవి అందని ద్రాక్షగానే మిగిలింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో..

మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న జుక్కల్ నియోజకవర్గం ఏర్పాటై ఆరున్నర దశాబ్దాలు దాటింది. 1957లో ఆవిర్భవించిన ఈ నియోజకవర్గం.. 1978లో ఎస్సీ రిజర్వుడ్‌గా మారింది. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే ఒక్కరికి కూడా మంత్రిగా అవకాశం దక్కలేదు. 1957లో స్వతంత్ర అభ్యర్థి మాధవరావు ఎమ్మెల్యేగా గెలవగా.. 62లో కాంగ్రెస్ అభ్యర్థి నాగ్‌నాథ్‌రావు, 67లో స్వతంత్ర అభ్యర్థి వి.రెడ్డి, 72లో స్వతంత్ర అభ్యర్థి విఠల్‌రెడ్డి విజయం సాధించారు. వీరిలో ఎవరికీ మంత్రిగా పనిచేసే అవకాశం రాలేదు. ఆ తర్వాత ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్‌గా మారింది. 1978, 1983, 1989, 2004 ఎన్నికలలో కాంగ్రెస్ నుంచి సౌదాగర్ గంగారాం గెలిచినా.. మంత్రి వర్గంలో చోటు కల్పించలేదు. 1985, 1994 ఎన్నికలలో తెలుగుదేశం నుంచి బేగరి పండరి, 1999 లో అరుణతార, 2009లో హన్మంత్ సింధే గెలిచారు. ఆ సమయంలో టీడీపీ అధికారంలో ఉన్నా వీరిని మంత్రివర్గంలో చేర్చుకోలేదు.

ఈసారైనా అవకాశం దక్కేనా?

తాజాగా జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు విజయం సాధించారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. అయితే తొలిసారి ఎన్నికకావడంతో ఆయనకు అవకాశం దక్కడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాకా మొండిచేయే..

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక 2014లో జరిగిన ఎన్నికలలో జుక్కల్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధే భారీ మెజారిటీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ సారథ్యంలో ఏర్పడిన కొత్త కేబినెట్‌లోనూ జుక్కల్‌కు నిరాశే ఎదురయ్యింది. 2018 ఎన్నికలలోనూ హన్మంత్‌సింధే గెలవడంతో ఈ ప్రాంతానికి మంత్రి పదవి ఇస్తారని అంతా ఆశించారు. కానీ షరా మామూలుగానే పాలకులు మరోసారి మొండిచేయి చూపారు.

'విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి'



తాడ్వాయి: విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని విద్యాశాఖ తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసచారి సూచించారు. బుధవారం ఆయన తాడ్వాయి మండలంలోని పలు పాఠశాలలను పరిశీలించారు. అనంతరం కృష్ణాజీవాడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీచింగ్ డైరీలను నిర్వహించాలన్నారు. ప్రతి తరగతికి లైబ్రరీ పీరియడ్ కేటాయించాలని సూచించారు. పేరెంట్స్ మీటింగ్‌లకు తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట డీఈవో రాజు, పర్యవేక్షకులు వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, ఎంఈవో రామస్వామి, పాఠశాల హెచ్ఎం నివేదిత పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'పై అయోమయం!

మోర్తాడ్: ప్రభుత్వం మారడంతో గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్‌లు అందుకున్న వారు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికలకు ముందు కొంతమందికి గృహలక్ష్మి పథకానికి పలువురిని ఎంపిక చేసి హడావుడిగా ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా మండలాల అభివృద్ధి అధికారులు జారీ చేసినట్లుగా ప్రొసీడింగ్ కాపీలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జోరుగా పంపిణీ చేశారు. ప్రతి నియోజవర్గంలో మూడు వేల మందికి గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రొసీడింగ్‌లలో పేర్కొన్నారు. సొంత జాగా ఉండి ఇంటిని నిర్మించుకునేవారికి రూ.3లక్షలను మూడు విడతల్లో అందించడానికి ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్‌కు చెందిన ప్రతినిధుల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో ఎక్కువగా ఆ పార్టీకి అనుకూలంగా ఉన్నవారినే ఎంపిక చేశారన్న ఆరోపణలున్నాయి.

ప్రొసీడింగ్ కాపీలు ఎంపీడీవోలు జారీ చేసినట్లు ఉన్నా ఏ ఒక్క కాపీపై అధికారి సంతకం లేదు. ఈ విషయమై 'సాక్షి' పలువురు ఎంపీడీవోలను వివరణ కోరగా తమ కార్యాలయం నుంచి ఎలాంటి గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు జారీ చేసినట్లు అవగాహన లేదని వెల్లడించారు. ఈ విషయంలో తాము ఎలాంటి వివరణ ఇవ్వలేమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడం.. కాంగ్రెస్ పార్టీ ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల సాయం ప్రకటించడంతో గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లకు విలువ ఉంటుందా లేదా అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- స్ట్రాంగ్ రూం పరిశీలన



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకుగాను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఆన్‌లైన్ ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం బూత్ స్థాయి అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చేనెల 6న ముసాయిదా ఓటరు జాబితా, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లోని ఎన్నికల స్ట్రాంగ్ రూంలను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. జిల్లా ఎన్నికల విభాగం పరిధిలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు సంబంధించిన వీవీ ప్యాట్‌లలోని ఓటు స్లిప్పులను ఇక్కడ భద్రపరిచామన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, బాలరాజు, జాఫర్ ఖాన్, రషీద్‌ఖాన్, కాసీం అలీ, కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు అనిల్ కుమార్, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ రేసులో ఇద్దరు..

- పదవి ఆశిస్తున్న షబ్బీర్ అలీ, మహేశ్‌కుమార్ గౌడ్
- ఒకరికి అవకాశం రావొచ్చని ప్రచారం
- పార్టీ శ్రేణుల్లో జోరుగా చర్చ

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అవుతుండడంతో ఇప్పుడు అందరి దృష్టి పీసీసీ చీఫ్ పదవిపై పడింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్‌లలో ఒకరికి పీసీసీ అధ్యక్ష పదవి దక్కవచ్చని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.



షబ్బీర్‌అలీ



మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పీఠం ఎవరికి దక్కుతుందోనని ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ వచ్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో పీసీసీ పీఠం విషయమై పార్టీ అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి అవుతుండడంతో పీసీసీ పదవిని బీసీ లేదా మైనారిటీ వర్గానికి కేటాయించాలనే ఆలోచన ఏఐసీసీ నాయకత్వం చేస్తోంది. ఈ క్రమంలో సీనియర్ నేతలైన మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, ఉమ్మడి జిల్లాకు చెందిన మహేశ్‌కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ పేర్లను అగ్రనేతలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే భట్టి విక్రమార్కకు ఉపముఖ్యమంత్రి, పొన్నం ప్రభాకర్‌కు బీసీ కోటాలో మంత్రి పదవి ఖరారు చేసినట్లు సమాచారం. దీంతో సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా షబ్బీర్‌కు మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ ఇచ్చి, ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చే విషయమై పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రియాశీలక పాత్ర పోషిస్తున్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను పీసీసీ పీఠంపై కూర్చోబెట్టే విషయమై సైతం అధిష్టానం ఆలోచన చేస్తుండడం గమనార్హం. ప్రత్యేక పరిస్థితుల్లో షబ్బీర్ అలీ, మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు అగ్రనేతలు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది.

నాలుగు దశాబ్దాలుగా సేవలు

కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి పోటీ చేయడంతో షబ్బీర్ అలీ అక్కడి నుంచి తరలి నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలోకి దిగారు. అర్బన్ ఓటమి ఎదురవడంతో ఎమ్మెల్సీ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి సేవలందజేస్తున్న షబ్బీర్‌ను మైనారిటీ కోటాలో కేబినెట్‌లోకి తీసుకునే అవకాశాలున్నప్పటికీ, అది కుదరని పక్షంలో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వనున్నట్లు చర్చ జరుగుతోంది. షబ్బీర్ అలీకి మంత్రి పదవి ఇస్తే మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ పీఠం అప్పజెప్పే ఆలోచన చేస్తున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. మహేశ్‌కుమార్ గౌడ్ సైతం నిజామాబాద్ అర్బన్ టికెట్ ఆశించారు. అయితే షబ్బీర్ అలీ ఇక్కడకు రావడంతో అధిష్టానం సూచనలతో ఈ సీటును త్యాగం చేశారు. ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని ఏఐసీసీ నాయకులు హామీ ఇచ్చారు. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో మహేశ్‌గౌడ్‌కు పీసీసీ పీఠం ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గానూ వ్యవహరించారు. ఈ నేపథ్యంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కానీ షబ్బీర్‌అలీకి కానీ పీసీసీ పీఠం దక్కితే ధర్మపురి శ్రీనివాస్ తర్వాత ఈ బాధ్యతలు స్వీకరించినవారవుతారు. ఉమ్మడి ఇందూరు జిల్లాకు మరోసారి పీసీసీ పీఠం దక్కుతుందో లేదో చూడాల్సి ఉంది.

'అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి'



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కాలనీలోగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల భరత్, విపుల్, వెంకట్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో బుధవారం ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, సహాయ సంక్షేమ అధికారి వెంకటేష్, డీఆర్‌డీవో సాయన్న, డీపీవో భాగ్యలక్ష్మి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సాయిలు, అధికారులు సాయిరెడ్డి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ పాటిల్, అధికారులు

క్లుప్తంగా

మున్నూరుకాపు మాస పత్రిక ఆవిష్కరణ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం మున్నూరు కాపు సంఘం మాస పత్రికను మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు బస్వరాజ్, నక్క గంగాధర్, పప్పు రమేశ్, గాదె తిరుపతి తదితరులున్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై లావణ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని అన్నారు. గిఫ్టులు, డబ్బులు వచ్చాయి అన్న మెసేజ్‌లను పట్టించుకోవద్దని, గుర్తు తెలియని ఫోన్‌లను లిఫ్టు చేయవద్దన్నారు. ఏఎస్సై అబీద్ బేగ్, కానిస్టేబుల్ మోహిబీన్, సిబ్బంది మహేష్ ఉన్నారు.

'లింగ ఆధారిత హింసపై అప్రమత్తంగా ఉండాలి'



కామారెడ్డి అర్బన్: ఆడ పిల్లలు, బాలికలు, మహిళలపై సమాజంలో లింగ ఆధారిత హింస పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌ఆర్‌డీ) ఆర్గనైజర్ అమృత రాజేందర్ అన్నారు. బుధవారం కామారెడ్డి పట్టణ పరిధిలోని అడ్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లింగ ఆధారిత హింసపై నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐఎస్‌ఆర్‌డీ ఆధ్వర్యంలో డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం వరకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు వేధింపులకు గురైతే వెంటనే పోలీసు హెల్ప్ లైన్ 100, 181, 1098 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కనుల పండువగా ఆరట్టు

- నగరవీధుల మీదుగా కొనసాగిన శోభాయాత్ర
- యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో ఆరట్టు ఉత్సవం ఘనంగా జరిగింది. నగరంలోని కంఠేశ్వర్‌లో అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి అనుగ్రహంతోనే తాను ఈ స్థాయిలో ఉన్నానని అన్నారు. అనంతరం స్వామి వారిని విగ్రహాన్ని రథంపై ఉంచి ఊరేగించారు. కంఠేశ్వర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర రఘునాథ్ చెరువు వరకు కొనసాగింది. వాడవాడలా భక్తులు స్వామి వారి రథంపై పూలవర్షం కురిపించారు. అయ్యప్ప పాటలపై దీక్షాపరులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భక్తవత్సలం నాయుడు, బీజేపీ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, ఆలయ అర్చకుడు రమేశ్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

30 ఏళ్లుగా శోభాయాత్ర

నగరంలో 30 ఏళ్లుగా అయ్యప్ప ఆరట్టు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు భక్తవత్సలం నాయుడు(ఢిల్లీ) తెలిపారు. శబరిమలలో జరిగిన విధంగా ఇక్కడ ఆరట్టు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏటా వందలాది మంది అయ్యప్ప స్వాములు ఈ ఉత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు.







రథంపై స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు, ఉత్సవంలో నృత్యం చేస్తున్న మణికంఠుడు

వైభవంగా కాలభైరవుడి రథోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు



అగ్నిగుండంలో వీరశైవమహేశ్వరులు

రామారెడ్డి: మండలంలోని ఇసన్నపల్లిలో నిర్వహిస్తున్న కాలభైరవుడి జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించిన రథోత్సవం, అగ్నిగుండాలతో ముగిశాయి. ఉదయం ప్రారంభమైన రథోత్సవం ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామాల్లో కొనసాగింది. యువకులు రథాన్ని లాగడానికి భారీగా తరలివచ్చారు. అగ్ని గుండ కార్యక్రమాన్ని వీరశైవ మహేశ్వరులు ప్రారంభించారు. అనంతరం ఆలయంలో దండకాలు వేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. పోలీసులు ట్రాఫిక్ సమస్య లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

ముగిసిన వీరభద్ర ఉత్సవాలు

మద్నూర్: మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వీరభద్రుడి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాలకు జిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడు కార్తీక పౌర్ణమి తర్వాత 9వ రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు సంగాయప్ప తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీ సేవ చేపట్టారు. వీరభద్రుని ఉత్సవాల సందర్భ అగ్నిగుండం నిర్వహించారు. భక్తులు నిప్పు కణికలపై నడిచి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.



పూజలందుకుంటున్న స్వామి వారి విగ్రహం



అగ్నిగుండం దాటుతున్న భక్తురాలు

అంతా మా ఇష్టం..

- ప్రైవేటు పాఠశాలల్లో పరీక్ష ఫీజు పేరిట దోపిడీ
- అసలు ఫీజు రూ. 125.. వసూలు చేసేది రూ. 1700
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

నిజామాబాద్ అర్బన్: పరీక్షల ఫీజుకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కాగితాలకే పరిమితమవుతోంది. ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కి ఎవరికి ఇష్టం వచ్చినంత వారు దోచుకునేందుకు ప్రైవేటు పాఠశాలల రంగం సిద్ధమైంది. పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు వాస్తవానికి రూ. 125 చెల్లించాల్సి ఉండగా.. ఏకంగా రూ. 750 నుంచి రూ. 1500 వరకు వసూలు చేస్తోంది. దీనిని పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం విచారకరం.

జిల్లాలో ఈ ఏడాది 21,245 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరికి గత నెల జిల్లా విద్యాశాఖ పరీక్ష ఫీజు చెల్లించాలని ఆదేశించింది. వాస్తవానికి విద్యార్థులు రూ. 125 ఫీజు మాత్రమే చెల్లించాలి. కానీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి రూ. 750 నుంచి రూ. 1500 వరకు అధిక ఫీజు వసూలు చేస్తున్నాయి. నగరంలోని ఆర్మూర్ రోడ్డులోని మూడు ప్రధాన పాఠశాలలు ఒక్కో విద్యార్థి నుంచి పదో తరగతి పరీక్ష ఫీజును రూ. 1200, ఇదే ప్రాంతంలోని మరో రెండు పాఠశాలలు రూ. 750, వినాయక్‌నగర్‌లోని ఓ పాఠశాల ఏకంగా రూ. 1500 వసూలు చేస్తోంది. పరీక్షఫీజు గడువు ముగిసిందని, అపరాధ రుసుము, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఇలా పలు కారణాలు చూపుతూ పరీక్ష ఫీజును అధికంగా వసూలు చేస్తున్నాయి. అధిక ఫీజు వసూలుతో విద్యార్థులో ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సైతం రూ. 300 నుంచి రూ. 500 వరకు పరీక్ష ఫీజు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రతి ఏటా ఇలా అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

అనేక కారణాలు చూపుతూ..

కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజును అధిక మొత్తంలో వసూలు చేయడానికి అనేక కారణాలు ఉన్నాయని ఆరోపణలున్నాయి. పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన నామినల్ రూల్స్ విద్యాశాఖకు అందించాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి పూర్తి వివరాలను సక్రమంగా నివేదించి విద్యాశాఖకు అందించాలి. ఈ వివరాల ప్రకారమే విద్యార్థికి హాల్ టికెట్, పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ అందజేస్తారు. ప్రతి ఏటా విద్యాశాఖ విద్యార్థుల నామినల్ రూల్స్ సమర్పించడంలో ప్రైవేటు పాఠశాలల నుంచి డబ్బులు వసూలు చేస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. అందుకనే విద్యార్థుల నుంచి ప్రైవేటు యాజమాన్యాలు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజును తీసుకోవాలి. విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేస్తే పాఠశాలల యాజమాన్యాలపై తగు చర్యలు తప్పవు. –దుర్గాప్రసాద్, డీఈవో

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

రాజంపేట: తలమడ్ల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా 10 సంవత్సరాల కాలం పాటు పని చేసి ఎల్లారెడ్డి తాలూకాకు బదిలీపై వెళ్లిన శ్రీ పంచ అంజల్ రెడ్డిని బుధవారం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాదవరెడ్డి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు అంజల్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్మల రాజు, గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌ఎంసీ చైర్మన్ స్వామి, సొసైటీ డైరెక్టర్ సావుసాని శివకుమార్, కృష్ణారెడ్డి, వెంకట్రెడ్డి,బాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లల్లో చోరీ

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మొండి రాజు, నందిగల్లీ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ ఇళ్లల్లోచోరీ జరిగినట్లు ఎస్సై హరిబాబు బుధవారం తెలిపారు. బాధితులు ఉదయం ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీంను రప్పించి పరిశీలన చేపట్టారు. కేసు నమోదు చేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



పోటీల్లో విజేతగా నిలిచిన నల్గొండ జట్టు



రన్నర్‌గా నిలిచిన రంగారెడ్డి జట్టు

బాల్కొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమని కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్ అన్నారు. మెండోరా మండలంలోని బుస్సాపూర్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. క్రీడాల్లో రాణించి జాతీయజట్టుకు ఎంపిక కావలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో టోర్నమెంట్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, ఉపాధ్యాయుడు సాయాగౌడ్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాధర్, పీడీ రాజుకుమార్, డీసీసీబీ డైరెక్టర్ శేకర్‌రెడ్డి , సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ సాయన్న, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. బుస్సాపూరలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ బాలికల 70 కబడ్డీ టోర్నమెంట్ విజేతగా నల్గొండ జట్టు విజయం సాధించింది. ద్వితీయ స్థానం రంగారెడ్డి జిల్లా జట్టు నిలిచింది.

తాడ్వాయిలో వడ్లలారీ బోల్తా

తాడ్వాయి: మండలంలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వడ్ల లారీ మంగళవారం రాత్రి బోల్తాపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలంలో కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో వస్తున్న లారీ కామారెడ్డి వైపు వెళ్తుండగా తాడ్వాయి శివారులో మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వడ్లబస్తాలు కిందపడగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రైవర్ నిద్రమత్తులోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్తులు తెలిపారు.



బోల్తాపడిన లారీ

కన్నాపూర్‌లో హోటల్ దగ్ధం

లింగంపేట: మండలంలోని కన్నాపూర్ బస్టాండ్ వద్ద గుడిసెలో కొనసాగుతున్న హోటల్ మంగళవారం రాత్రి దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన గ్యారవోయిన లక్ష్మి హోటల్ నడిపిస్తు జీవనం కొనసాగిస్తోంది. రోజువారిగా హోటల్ మూసేసి ఇంటికి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు హోటల్‌కు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలి బూడిదైంది. గతవారం బాధితురాలికి చెందిన ధాన్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అనుమానం ఉన్న వారితో గ్రామ పంచాయతీ పెద్దలు పంచాయతీ పెట్టారు. పాత కక్షలు మనసులో ఉంచుకున్నవారే హోటల్‌కు నిప్పు పెట్టారన్న బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



దగ్ధమైన హోటల్

క్రైం కార్నర్

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

గాంధారి: మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఉప్పు ఎల్లయ్య(45) కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ బుధవారం తెలిపారు. మృతుడి సమీప బంధువు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై మరొకరు..

నాగిరెడ్డిపేట: బొల్లారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాములు(41) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై లచ్చిరాం బుధవారం తెలిపారు. చిన్నకొడప్‌గల్‌కు చెందిన రాములుకు బొల్లారం గ్రామానికి చెందిన లలితతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. రాములు ఇల్లరికం రావడంతో బొల్లారంలో భార్యతో ఉంటున్నాడు. కొంత కాలంగా రాములు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మద్యానికి డబ్బులు కావాలని భార్య ను అడుగగా ఇవ్వకపోడంతో గ్రామ శివారులో పు రుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రా మ శివారులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో టీవీల దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వారం క్రితం రెండు ఎల్‌ఈడీ టీవీలు దొంగతనం జరిగినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు బుధవారం తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నగరంలోని పద్మానగర్‌కు చెందిన బొందల్వార్ పండరిని నిందితుడిగి గుర్తించినట్లు పేర్కొన్నారు. బుధవారం రూ. లక్ష విలువ చేసే రెండు ఎల్‌ఈడీ టీవీలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

డిచ్‌పల్లి: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన దేవ్‌నగర్‌లో బుధవారం చోటు చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన నవీన్‌కుమార్ (38) సుద్దపల్లికి పనినిమిత్తం బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా దేవ్‌నగర్‌సమీపంలో బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న చెరువులో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి ఒకరు..

గాంధారి: మండల కేంద్రానికి చెందిన పడాల సాయవ్వ(82) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ పేర్కొన్నారు. కాలనీకి సమీపంలో ఉన్న చెరువువద్దకు బుధవారం ఉదయం కాలకృత్యాలకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు రాములు ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

ఎడపల్లి: జైతాపూర్ శివారులో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పరశురాములు తన గేదెలను పొలాల్లో మేతకు తీసుకెళ్లగా విద్యుత్ తీగలు తెగి వీటిపై పడడంతో మృతిచెందాయి. విద్యుత్‌అధికారులు స్పందించి బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

షబ్బీర్ అలీ సోదరుడు దుర్భాషలాడారు

– మాచారెడ్డి ఎంపీటీసీ భర్త ఆవేదన

మాచారెడ్డి: మాజీ మంత్రి షబ్బీర్ అలీ సోదరుడు నయీం తనను ఫోన్‌లో బండ బూతులు తిట్టారని మాచారెడ్డి ఎంపీటీసీ సభ్యురాలు రావుల వినోద భర్త ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మాచారెడ్డిలో ఆయన మాట్లాడారు. మంగళవారం రాత్రి ఫోన్ చేసి కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీగా గెలిచి బీఆర్‌ఎస్‌లో ఎలా చేరుతావురా అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారని చెప్పారు. పోలీసులను పంపించి లోపల తోయిస్తానని బెదిరించారని అన్నారు. తనకు నయీంతో ప్రాణ భయముందని, రక్షణ కల్పించాలని కోరారు.

ముగ్గురి రిమాండ్

డిచ్‌పల్లి: నడిమి తండాకు చెందిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. తండాకు చెందిన లకావత్ మోజీరాం, లకావత్‌గజను లాలూ, లకావత్ నారాయణలు అటవీ భూమిని అక్రమంగా చదును చేసినట్లు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మానస ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

రాజంపేట: మండల కేంద్రంలోని న్యూ బీసీ కాలనీకి చెందిన నల్ల శారద అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో కాలనీవాసులు జీపీ సిబ్బందికి సమాచారం అందించారు. గ్రామ కార్యదర్శి అశోక్ కుమార్ సిబ్బంది కాలనీ పెద్దలతో పంచనామ నిర్వహించి అంత్యక్రియలు చేపట్టారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిరికొండ: మండలంలోని కొండూర్, తాళ్లరామడుగు గ్రామాల మధ్యన ఒర్రెలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై రమేశ్ బుధశారం తెలిపారు. మృతుడి వయసు 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుందని, చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.